
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.3। కనిష్ఠం 20.3

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్ జిల్లా వార్తలు



పసుపు వ్యాపారులదే హవా!

- నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్
- మార్కెట్‌కు వచ్చే పసుపునకు వారు నిర్ణయించిందే ధర
- సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు
- మూడు వారాల్లోనే క్వింటాలుకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు తగ్గింపు
- భారీగా నష్టపోతున్న రైతులు
- అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని వేడుకోలు

నిజామాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ఆర్మూర్‌రూరల్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపు వ్యాపారులదే హవా కొనసాగుతోంది. ఇతర రాష్ట్రాల్లో ధర అధికంగా ఉన్నా.. ఇక్కడి మార్కెట్‌లో వారు నిర్ణయించిందే పసుపునకు రేటు. ప్రతీరోజు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే ఒకరిద్దరు రైతులకు ఆరోజు అధిక రేటుకు కొనుగోలు చేసి.. మిగతా పసుపునంతా ధర తగ్గించి కొంటున్నారు. మార్కెట్‌లో రెండు వారాల్లోనే క్వింటాలుకు రూ.3నుంచి రూ.4వేలలోపు ధర తగ్గించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర నచ్చక రైతులు అమ్మకుండా ఉంటే రెండు రోజులపాటు ఆ పసుపును ఎవరూ కొనుగోలు చేయడం లేదు. చివరకు మార్కెట్‌లో ఉన్న దళారులు, ఏజెంట్లను ఆశ్రయించి తక్కువ ధరకే అమ్ముకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రైతు సంఘాలతో పాటు మార్కెట్ అధికారులకు విన్నవించినా మార్పు రావడం లేదు. పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లినా ధర మాత్రం పెరగడం లేదు. మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌తో పాటు ఇతర మార్కెట్‌లో ఇక్కడి పసుపునకు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నా.. ఇక్కడి వ్యాపారుల సిండికేట్ వల్ల ధర పెరగడం లేదు. కాగా, ఈ యేడు తెగుళ్లతో దిగుబడి తగ్గడంతోపాటు ధర కూడా తగ్గడం వల్ల భారీగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు అధికారులకు విన్నవిస్తున్నారు. ధర పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నెలన్నరగా మార్కెట్‌కు కొత్తపసుపు

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు నెలన్నరగా కొత్తపసుపు వస్తోంది. మొదట మార్కెట్‌కు ప్రతిరోజూ వెయ్యి నుంచి పదిహేనువందల క్వింటాళ్ల వరకు రాగా జనవరి చివరి వారం నుంచి ప్రతీరోజు 5వేల నుంచి 7వేల క్వింటాళ్ల మధ్య అమ్మకాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి రెండో వారం నుంచి మార్కెట్‌కు 10వేల క్వింటాళ్ల వరకు ప్రతీరోజు పసుపు వస్తుంది. మార్కెట్‌లో జనవరి ఆరంభంలో కొత్తపసుపు క్వింటాలు 10వేల నుంచి 15వేల రూపాయల మధ్య అమ్మకాలు జరిగాయి. కొత్త పసుపు ఎక్కువగా రావడం మొదలైన తర్వాత జనవరి చివరి వారంలో క్వింటాలు రూ.10వేల నుంచి రూ.13వేల 500మధ్య అమ్మకాలు జరిగాయి. ఫిబ్రవరి రెండోవారం వచ్చేవరకు క్వింటాలు రూ.9వేల నుంచి రూ.12వేల మధ్య అమ్మకాలు జరిగాయి. ఈవారం మాత్రం మరింత తగ్గించి రూ.9వేల నుంచి రూ.11వేల మధ్యనే క్వింటాలు అమ్మకాలు అవుతు న్నాయి. మార్కెట్‌లో మూడు వారాల్లోపే ధరల్లో భారీ తేడాలు వచ్చాయి. జనవరి చివరి వారంతో పోలిస్తే క్వింటాలుకు కొమ్మురకం 3వేల నుంచి 4వేల మధ్య ధర తగ్గింది. గోల రకానికి క్వింటాలుకు 2వేల నుంచి 3వేల మధ్య ధర తగ్గింది. ఈయేడు తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గగా మార్కెట్‌లో కూడా ధర తగ్గించి కొనడంతో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఏపీతో పాటు పక్కన ఉన్న మహారాష్ట్రలో కొమ్ము రకానికి క్వింటాలు రూ.13వేల నుంచి రూ.17వేల మధ్య అమ్మకాలు జరుగుతున్నాయి. మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో మాత్రం అత్యధికంగా 20వేల రూపాయల వరకు కూడా ధర వస్తుంది. మోడల్ రేటు ఆ మార్కెట్‌లో 15వేల వరకు కొనసాగుతోంది. నిజామాబాద్ మార్కెట్ పసుపు అమ్మకాలకు పేరుగాంచినా ప్రస్తుతం మాత్రం ధర రావడం లేదు.

భారీగా నష్టపోతున్న రైతులు

ప్రస్తుతం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపు అమ్మకాలు కొమ్మురకం క్వింటాలు 9వేల నుంచి 11వేల రూపాయల మధ్య అమ్మకాలు జరుగుతుండగా, గోల రకం 8వేల నుంచి 10వేల రూపాయల మధ్య అమ్మకాలు జరుగుతున్నాయి. మూడు వారాల్లోనే ధర తగ్గించడం వల్ల పసుపు అమ్మకాలు చేసే రైతులు భారీగా నష్టపోతున్నారు. గత సంవత్సరం పసుపుకు రికార్డు స్థాయిలో ధరలు వచ్చాయి. క్వింటాలు 13వేల నుంచి 18వేల వరకు అమ్మకాలు జరిగాయి. ఈ సంవత్సరం మాత్రం సాగుచేసిన రైతులు ఎక్కువ ధర వస్తుందని ఆశిస్తే వ్యాపారుల సిండికేట్ వల్ల నష్టపోతున్నారు. జిల్లా మార్కెటింగ్‌తో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకుని గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు. వ్యాపారులు మాత్రం మార్కెట్ పర్యవేక్షించే వారు లేకపోవడం వల్ల ఇష్టం వచ్చిన రీతిలో కొనుగోలు చేస్తున్నారు. ఎవరైనా రైతులు, రైతు సంఘాల నేతలు వ్యాపారులను అడిగితే పచ్చి పసుపు తీసుకువస్తున్నారని వ్యాపారులు సమాధానాలు చెప్తున్నారు. బయట ధర లేదని తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నామని వివరిస్తున్నారు. పసుపునకు ఇతర ప్రాంతాల్లో డిమాండ్ కూడా ఎక్కువగానే ఉంది. గత సంవత్సరం గల్ఫ్ దేశాలతో పాటు ఇతర దేశాలకు కూడా పసుపును ఎగుమతి చేశారు. జిల్లా నుంచి నేరుగా బంగ్లాదేశ్‌కు కూడా రైలుమార్గంలో పసుపును తరలించారు. ధరలు లేక గత కొన్నేళ్లుగా సాగును తగ్గిస్తున్న రైతులు ఇదే రీతిలో ధర ఉంటే పంట వేసే పరిస్థితులు లేవని వారు విన్నవిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకుని క్వింటాలుకు 15వేల రూపాయల ధర వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు.

మార్కెట్‌లో 40మంది వ్యాపారులు

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో పసుపు కొనుగోలు చేసే వ్యాపారులు 40మంది వరకు ఉన్నారు. వీరిలో ఎక్కువ మొత్తంలో కొను గోలు చేసే వ్యాపారులు 20మంది వరకే ఉన్నారు. వీరే మార్కెట్‌ను శాసి స్తున్నారు. ఇక్కడి మార్కెట్‌లో కొనుగోలు చేసి ఉత్తరాది రాష్ట్రాలకు పసుపును పంపిస్తారు. అక్కడి వ్యాపారులతో ఒప్పందం చేసుకుని వారికి అవసరమైన పసుపును సరఫరా చేస్తారు. కొంతమంది వ్యాపారులకు ఇతర రాష్ట్రాల్లో పసుపు నుంచి ఉత్పత్తులు చేసే పరిశ్రమల్లో భాగస్వా మ్యం కూడా ఉంది. ప్రతి సంవత్సరం ఈ మార్కెట్‌కు వచ్చే పసుపు కొనుగోలును ఈ బడా వ్యాపారులే శాసిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో వీరే కొనుగోలు చేస్తుండడం వల్ల కమీషన్ ఏజెంట్లతో పాటు దళారులను వీరు కంట్రోల్‌లో ఉంచుకుంటున్నారు.


మార్కెట్‌లో పట్టించుకునే వారే లేరు..

:రాజశేఖర్, రైతు (మారంపల్లి)

పసుపు రైతులను మార్కెట్‌లో పట్టించుకునే వారే లేరు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ఇష్టారీతిన ధర నిర్ణయిస్తున్నారు. ఎండబెట్టిన పసుపును సైతం ధర తగ్గించి కొంటున్నారు. అధికారులకు విన్నవించినా పట్టిం చుకోవడం లేదు. దళారులకు చెప్పుకుని అమ్ముకోవాల్సిన పరిస్థితి మార్కెట్‌లో ఉంది. మూడు వారాల్లోనే క్వింటాలుకు రూ.4వేల వరకు ధర తగ్గించారు. దిగుబడి రాక ప్రస్తుతం వస్తున్న ధర వల్ల రైతులకు నష్టాలే తప్ప మిగిలేది ఏమీలేదు.

ధరలు ఇట్లా ఉంటే పంటవేసి లాభం లేదు..

:భరత్‌రెడ్డి, వన్నెల్(కె) (రైతు)



మూడు ఎకరాల్లో పసుపు సాగుచేశాను. గత సంవత్సరం లాగ ధర ఉంటుందని పసుపు వేశాం. మార్కెట్‌కు వస్తే ధర రావడం లేదు. రెండు వారాల క్రితం క్వింటాలుకు రూ.13వేలు అమ్మకాలు చేయగా ఈరోజు రూ.10,100కు కొనుగోలు చేశారు. ఈరేటు వస్తే రైతుకు మిగిలేది ఏమీలేదు. పసుపునకు ధర వచ్చే విధంగా చూస్తామని చెప్పినా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలి.

పంట చేతికి వచ్చినంక ధర తగ్గించారు..

:అన్వేష్ రెడ్డి, రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్



పసుపు పంట మార్కెట్‌కు రాకముందు క్వింటాలు రూ.15వేల వరకు ధర పెట్టి కొనుగోలు చేశారు. రైతులు పంటను మార్కెట్‌కు తీసుకురాగానే రూ10వేల లోపు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల రైతులు నష్టపోతున్నారు. గత సంవత్సరంలాగానే అధికారులు వ్యాపారులతో సమావేశం నిర్వహించాలి. కలెక్టర్ చొరవ తీసుకుని పసుపు వ్యాపారులతో మాట్లాడాలి. ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ధర తగ్గకుండా చర్యలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

మార్కెట్‌లో ధరలు తగ్గకుండా చూస్తున్నాం..

:ముప్ప గంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్



వ్యవసాయ మార్కెట్‌లో ధరలు తగ్గకుండా చూస్తున్నాం. గోల రకం క్వింటాలుకు రూ.8వేలు ఫిక్స్ చేసాం. కొమ్ము రకం క్వింటాలుకు రూ.10వేలుగా ఫిక్స్ చేసాం. మార్కెట్‌లో ఈ ధరలకు పైనే కొనే విధంగా చూస్తున్నాం. కొంత పచ్చిపసుపు రావడం వల్ల ధర తగ్గుతుంది. అయినా వ్యాపారులతో మాట్లాడి కొనుగోలు జరిగే విధంగా చూస్తున్నాం.

కేసీఆర్ ఆరు నెలలు కుంభకర్ణుడిలా నిద్రపోయాడు

- ప్రతిపక్ష హోదా ఉన్నా.. ఫాంహౌస్‌కే పరిమితయ్యాడు
- రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పనైపోయింది
- పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, పక్కన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

నిజామాబాద్ ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'బీఆర్‌ఎస్ నేత కేసీఆర్ ఆరు నెలలు కుంభకర్ణుడిలా నిద్రపోయాడు. ప్రతిపక్ష హోదా ఇస్తే ఫాంహౌజ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు బయటకు వచ్చి కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని ప్రకటనలు చేస్తున్నాడు' అంటూ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. నగరంలో బుధవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇక బీఆర్‌ఎస్ పని అయిపోయిందని భవిష్యత్తులో ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదన్నారు. అధికారంలో ఉన్న సమయంలో అధికారులను బెదిరించి పనులు చేసుకున్నారన్నారు. సీఎం.రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన కొనసాగుతుందన్నారు. బీఆర్ ఎస్ పాలనలో బీసీలను అడుగడుగున అణగదొక్కారని ఆయన ఆరోపించారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలకు లేదన్నారు. సీఎం.రేవంత్‌రెడ్డికి కేసీఆర్‌కు అసలు పోలికేలేదన్నారు. సమస్యలపై మాట్లాడని కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఉద్యోగాలు ఇవ్వకపోగ నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొమ్మిదేళ్ల కాలంలోనే 56వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ ఎన్నికలు బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ అన్నారు. పట్టభద్రులంతా కాంగ్రెస్ వెంటే ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ బీజేపితో చీకటి ఒప్పందాన్ని చేసుకుందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అందుకే పోటీ చేయకుండా దూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ చేతల ప్రభుత్వమని బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఉపాధి అవకాశాల కోసం చట్టబద్దత తీసుకొచ్చేందుకు చర్యలుచేపట్టామని ఆయన అన్నారు. భవిష్యత్తులో బీసీలకు కీలకపదవులు వస్తాయన్నారు. బీఆర్‌ఎస్ నేతలు సోషల్‌మీడియాల అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.

నరేందర్‌రెడ్డిని గెలిపించాలి..

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీ మధ్యనే పోటీ ఉందన్నారు. పదేళ్లలో రాష్ట్రానికి బీజేపి ఎలాంటి మేలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. విద్యా సంస్థలు నిర్వహిస్తున్న ఆయనకు నిరుద్యోగుల సమస్యలు తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను అమలు చేస్తుందని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, మురళీనాయక్, మాజీ ఎమ్మెల్సీలు అర్కెల నర్సరెడ్డి, ఆకుల లలిత, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్‌హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గంగాధర్, నుడా చైర్మన్ కేశవేణు, గ్రంధాలయసంస్థ చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, పక్కన ఎంపీ అర్వింద్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్

నిజామాబాద్ ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ అన్నారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి అంజిరెడ్డిని, తపాస్ బలపరిచిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ సంఘటన మంత్రి చంద్రశేఖర్, ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం



స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న రైల్వే జనరల్ మేనేజర్ అర్వింద్‌కుమార్



మాట్లాడుతున్న రైల్వే జనరల్ మేనేజర్

- రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తాం
- రైల్వే జనరల్ మేనేజర్ అర్వింద్‌కుమార్ జైన్

ఖిల్లా, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మెరుగైన సేవలందిస్తామని, స్టేషన్లలో వసతులు మెరుగుపర్చుతామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అర్వింద్‌కుమార్ జైన్ అన్నారు. అమృత్ భారత్‌లో భాగంగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరించనున్నామని అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ప్రత్యేక రైలులో ఆయన నగరంలోని రైల్వేస్టేషన్‌లో పలు విభాగాలను పరిశీలించారు. ప్రయాణికుల సేవలపై ఆరా తీశారు. రన్నింగ్‌రూమ్‌ను పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఎఫ్ సిబ్బందికి ఆదేశించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ మరిన్ని రైళ్లను నడపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న డబ్లింగ్ రైల్వే పనులను పరిశీలించారు. రానున్న రోజుల్లో ఇప్పుడున్న రైల్వే స్టేషన్‌ను ఆదునీకరించి అమృత్‌భారత్ రైలు పథకం అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట పీసీఓఎమ్. పద్మజ, డీఆర్ఎం.లోకేష్‌వైష్ణోయ్, పీసీఈ బ్రహ్మానందం, సీఓఎం.(జనరల్) రవిచంద్రన్, డీవోఎం.విద్యాధర్‌రావ్, సీనియర్ డీఈవో దుర్గాప్రసాద్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

- శివాజీ మహరాజ్‌కి జై నినాదాలతో మార్మోగిన వీధులు
- నివాళ్లు అర్పించిన హిందూ సంస్థలు, ప్రజాప్రతినిధులు
- ఉత్సవాల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్



హిందూ వాహిణి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద..

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హిందూ సామ్రాజ్యాన్ని అఖండ భారత దేశంగా విస్తరించడానికి పోరాటం చేసిన మరాఠ యోధుడు వీర ఛత్రపతి శివాజీ మహరాజ్ 395వ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. హిందూ సంస్థలతో పాటు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు శివాజీ జయంతి ఉత్సవంలో పాల్గొని నివాళ్లలు అర్పించారు. యువకులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శివాజీ మహరాజ్‌కి జై అంటూ.. నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. జిల్లా కేంద్రంలోని బోర్గాం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ హృదయ్ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహరాజ్ హిందూ ధర్మ రక్షణ కోసం మొగల్‌రాజులను ఎదిరించి హిందూ స్వరాజ్య స్థాపనకు తన ప్రాణాలను అర్పించారన్నారు. శివాజీ మహరాజ్ వీరత్వానికి తల్లి జిజియాబాయి గొప్ప స్ఫూర్తి చిన్నతనం నుంచే ఆయనకు శక్తులను ఎదిరించేలా తీర్చిదిద్దారని అన్నారు. మొగల్‌ల కాలంలో హిందువులను బానిసలుగా చేసి మతమార్పిడిలు బలవంతంగా జరిగించిన రోజుల్లో శివాజీ తన 17వ ఏటనే కత్తి చేత పట్టి జై భవాని అంటూ మొగలులపై తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. నేటి యువత మొగులాయి చరిత్ర కంటే ఛత్రపతి శివాజీ వీరసావర్కర్, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయుల చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వామి వివేకనందా చెప్పినట్లు ఉక్కు నరాలు ఇనుపకండరాలు, వజ్రసంకల్పం కలిగిన యువతనే భవిష్యత్తు భారత దేశాన్ని నిర్మించగలుగుతారన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ నగరంలోని గాజుల్‌పేట్, నాగారం, నాందేవ్‌వాడ శివాజీచౌక్, రైల్వే స్టేషన్ వద్ద, ఆర్‌ఆర్ చౌరస్తా వద్దగల శివాజీ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. ఆయన వెంట శివాజీ ఉత్సవ సమితి సభ్యులు, హిందూ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందూ వాహిణి ఆధ్వర్యంలో..

ఛత్రపతి జయంతి ఉత్సవాన్ని హిందు వాహిని సంస్థ ఘనంగా నిర్వహించింది. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో భాగంగా రైల్వేస్టేషన్ వద్దగల శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా హిందూ వాహిని ప్రతినిధి సురేష్ మాట్లాడుతూ.. మొగలాయి సామ్రాజ్య పతనాన్ని శాసించిన మరాఠ యోధుడు, హిందూ సామ్రాజ్యం నిర్మించిన భరతమాత వీర పుత్రుడు శివాజీ అని అన్నారు. నేటి యువత భరతమాత ముద్దుబిడ్డ పౌరుషాన్ని, సాహసాన్ని ప్రేరణగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాయిప్రసాద్, అనిల్, వినయ్, శ్రీకాంత్, విశ్వహిందు పరిషత్ జిల్లా సహకార్యదర్శి ధాత్రికర మేష్, నగర కార్యదర్శి రాంప్రసాద్, నగర ఉపాధ్యక్షుడు నికేష్, నగర భజరంగ్‌ధళ్ సహ సంయోజక్ సురేష్, మహేష్, గజానంద్, శైలేష్, గోపి, ప్రణయ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.


నగరంలో శివాజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


బోధన్‌లో శివాజీ జయంతి వేడుకల దృశ్యం


పడిగెలలో..

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):ఐక్యత ధర్మాన్ని పాటించిన మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు.శివాజీజన్మదినాన్ని పురస్కరించు కొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు ప్రాంతాల్లో వీహెచ్‌పీ,భజరంగ్‌దళ్,హిందూసంస్థల ఆధ్వర్యంలో ఛత్ర పతి శివాజీ చేసిన చేసినసేవలను నినాదాలతో నగరంలోని పలు వీధుల గుండా ర్యాలీని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్, బోర్గాం (పి), నాందేవ్‌వాడ, రైల్వేస్టేషన్, కోటగల్లి తదితర ప్రాంతాల్లో శివా జీ విగ్రహాల ఎదుట హిందూసంస్థలు ప్రత్యేకపూజలు చేసిపండ్లు, ప్రసాదాలు అందజేశారు.శివాజీ హిందూ రాష్ట్రంకోసం పోరాడిన పోరాటాల ను కొనియాడారు. శివాజీనగర్‌లోని రామకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో విద్యా ర్థుల చే ర్యాలీ నిర్వహించి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివా ళులు అర్పించారు

మోపాల్:ఛత్రపతి శివాజీ జయంతి వేడుక లను వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సారం గఫూర్‌లోని బస్టాండ్ ఆవరణలో బుధవారం శివాజీచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఆయన అడుగుజాడల్లో యువత నడవాలన్నారు. ఈ కార్యక్ర మంలోనాగేష్,శ్రీనివాస్‌గౌడ్,రాంసింగ్,రవి,నగేష్,అంజి,సాయిరాం పాల్గొన్నారు.

నవీపేట: మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అభంగపట్నం, నవీపేట, కోస్లీ, యంచ, ఫకీరాబాద్, జన్నేపల్లి, నాళేశ్వర్‌లలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

రెంజల్: రెంజల్ మండల కేంద్రంతో పాటు తాడ్‌బిలోలి, బోర్గాం, సాటాపూర్, నీలా,దూపల్లి, కందకుర్తి గ్రామాలలో బుధవారం మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాజీచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, రూపేష్, నవీన్, నాగనాథ్ పటేల్, శ్రీకాంత్,సుమన్, దీపక్, మోహన్, హరీష్, యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: శివాజీ మహరాజ్ బాటలో నడుస్తూ యువత హిందుత్వాన్ని కాపాడాలని శివసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పసులోటి గోపికిషన్ అన్నారు. బుధవారం బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, శరత్ రెడ్డి, అంకు మహేష్, అంకు దామోదర్, డాక్టర్ సుధాకర్, సంగ్రామ్, హిందు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● హిందు యువత దేశ, ధర్మ రక్షణ కోసం పాటుపడాలి

హిందు యువత దేశ, ధర్మ రక్షణ కోసం పాటుపడాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ న్రా వెంకట శివకుమార్ అన్నారు. బుధవారం శివాజీ జయంతి సందర్భంగా హిందువాహిని బోధన్ శాఖ ఆధ్వర్యంలో రాకాసిపేట్ హనుమాన్ మందిరం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు యువకులతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏకచక్రపుర కిసాన్ చైర్మన్ సిరవేణి పుష్ప, హిందువాహిని జిల్లా నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల నర్సయ్య, పుప్పాల సుబాష్, గంగాదాసు, గంగారాం, అబ్దుల్‌అమిద్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహిపాల్‌యాదవ్, శ్రీనివాస్‌నాయక్, గోపాల్‌నాయక్, రాము, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కర్క గంగారెడ్డి, మహేష్, గంగాదాసు, గణేష్, రాజశేఖర్, అక్షయ్, తిరుపతి, దేవేందర్, ఇతర పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని పలు గ్రామాలలో ఛత్రపతి శివాజీ మహరాజ్ 395వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహిం చారు. రామన్నపేట్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటా నికి, వేల్పూర్‌లో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో శివాజీ మహ రాజ్ విగ్రహానికి, పడిగెల, జాన్కంపేట్ శివాజీ యువజన సంఘాల ఆధ్వర్యంలో శివాజీ విగ్రహాలకు, మరికొన్ని గ్రామాల్లో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సం ఘం కార్యదర్శి జంబవ చామర్, ఉపాధ్యక్షుడు సుమన్, వినోద్, భూ మేశ్వర్, నారాయణ,ఆయా గ్రామాల సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు బుధవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సిరికొండ మండల కేంద్రంలో శివాజీ యువజన సంఘంసభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వాల్గోట్,రావుట్ల, న్యావనంది, రామడుగు, హుస్సేన్‌నగర్, గ్రామాల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో శివాజీ విగ్రహాలకు, ఘనంగానివాళ్లు అర్పించారు. బైకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంతోష్,బాబురావు,గణేశ్,దేగాంసాయన్న,రమేశ్,రాజారెడ్డి పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో పూలే అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ పస్కనర్సయ్య రాములు, రాజు, ప్రసాద్, జగదీశ్వర్, మహేందర్, మహేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

● అంకాపూర్‌లో..

మండలంలోని అంకాపూర్ గ్రామంలో హిందు సేవసమితి ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో హిందు సేవ సమితి సభ్యులు రాజేందర్, బాజన్న, సంతోష్,క్రాంతి, కిరణ్, రమేష్, చందు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:శివాజీ జయంతిని బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా శివాజీ చిత్రపటానికి ఏబీవీపీ విద్యార్థి నాయకులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. శివాజీ సేవలను కొనియాడారు. ఈకార్యక్రమం లో ఏబీవీపీ నాయకులు శివా, అమృత్‌చారి, సాయికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

మోస్రా: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా పలు హిందూ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి హిందూ రాజ్యస్థాపన కోసం ఆయన పడిన కష్టాన్ని, శత్రువులను ఎదుర్కొన్న విధానాన్ని హిందూ సంఘాల కార్యకర్తలకు వివరించారు. మోస్రా నుండి తిమ్మాపూర్ వరకు ర్యాలీ కొనసాగింది.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ మండలంలోని కొత్తపేట్, మల్కాపూర్, లింగితండా, ముత్తకుంట గ్రామాల హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మండలంలోని ఆయానాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడపల్లి:ఎడపల్లి మండల కేంద్రంతోపాటు ఠాణాకలాన్, జానకంపేట గ్రామాలలో మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:కేశ్‌పల్లిలో బుధవారం రాత్రి ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని మాజీసర్పంచ్ మైదం మహేశ్వర్, మాజీఎంపీటీసీ గంగాధర్, మాజీఉపసర్పంచ్ బాస్కర్‌గౌడ్, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు కలిసి ఆవిష్కరించారు. పడకల్, కలిగోట్, కొలిప్యాక్, అర్గుల్, గ్రామాల్లో శివాజీ విగ్రహాలకు పూలమాలలువేసి జయంతి వేడుకలను నిర్వహించారు.

ముప్కాల్:మండల కేంద్రంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.


ధర్పల్లిలో..


టీయూలో..


మచ్చర్లలో రక్తదానం చేస్తున్న యువకులు


నవీపేటలో..

'గంజాయికి యువత దూరంగా ఉండాలి'

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో గంజాయి నివారణకు ఆర్మూర్ సీఐ సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం గ్రామసచివాలయంలో ఆయన మాట్లాడుతూ గంజాయి వల్ల యువత భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్, పంచాయతీ కార్యదర్శి రాజలింగం, సంజీవ్, గంగాధర్, దుబ్బాక సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఎడపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన మొగుల రమేష్(34) అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన మొగుల రమేష్ అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం ఇంటి నుండి బయలు దేరి ఇప్పటి వరకు తిరిగి రాలేదని అతని తల్లి రాజమణి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని బీఎల్‌ఎస్‌ఏ జిల్లా పీఎల్‌వీ పద్మసింగ్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని బాలుర ప్రభుత్వ వసతి గృహాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మౌలిక సదుపాయలతో పాటు పరిశుభ్రతకు కావాల్సిన వసతులు కల్పించాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎల్‌వీ రమణ, సుజాత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వర్ని,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం వర్ని మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంట సరుకులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని సూచించారు.

బోధన్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ బుధవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర నాయకులు మల్లేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు వరదయ్య, సీఐటీయూ నాయకులు శంకర్ గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏ మాత్రం ప్రజా ఆమోదమైన బడ్జెట్ ప్రవేశపెట్టలేదని, బడా పెట్టుబడిదారుల కార్పొరేటర్ల బడ్జెట్ అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో రైతులు 13 నెలల పాటు రైతాంగం ఢిల్లీలో మోడీతెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడితే ఆ రోజు రైతాంగానికి క్షమాపణ చెప్పిన మోడీ రైతాంగ సంక్షేమంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని తీవ్రంగా విమర్శించారు. కార్మికవర్గాలు పోరాడి అనేక త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడేలా లేదన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 19:(ఆంధ్రజ్యోతి) విద్యార్థులు శ్రద్ధాబుద్ధులతో చదువుతూ ఉన్నత లక్ష్యాల కోసం కృషిచేయాలని కమ్మర్‌పల్లి ఎస్ఐ అనీల్ రెడ్డి అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని శ్రీభాషిత జూనియర్ కలాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చ్‌నెలలో నిర్వహించూ వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. అంతకు ముందు విద్యార్థిని విద్యార్థులు డీజేపాటలపై అదిరేటి స్టేప్పులు వేశారు. అనంతరం కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏటూర్నర్ రాజశేఖర్, డైరెక్టర్‌లు సుంకెట రవి, సిలివేరి సంజీవ్, మలావత్ సంతోష్ కళాశాల అధ్యపకులు సుమన్, సాయన్న, గజానంద్, శ్రీధర్, శ్రీనివాస్, రాజేష్, శ్రుతి, చైతన్య, అల్పన, రియాన తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది ఉన్నత స్థానంలో నిలిపేది చదువేనని ఎంఈవో రాజగంగారాం అన్నారు. ఆర్మూర్ మండలంలోని ఇస్సాపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. క్రమశిక్షణతో చదివి రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణరెడ్డి, చిన్నారెడ్డి, జగదీశ్వర్, అరుంధతి, కృష్ణచైతన్య, అర్పిత, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి'


కాంగ్రెస్ కార్యకర్తలతో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

మోస్రా,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులు మండల కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను కలిసి పార్టీలో జోష్ నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని పార్టీ నాయకులకు సూచించారు.ఈ సందర్భంగా మండల నాయకులు వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలని వినతి

మోస్రా,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారిపై ఉన్నటువంటి కోనోకార్పస్ చెట్లు తొలగించాలని బుధవారం మండల బీజేపీ నాయకులు మండల పంచాయతీ అభివృద్ధి అధికారి మధురిమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ కోనోకార్పస్ చెట్ల వల్ల ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారికి శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులు తలెత్తుతున్నాయన్నారు. అదే విధంగా వాహనదారులకు కళ్లలో నలుసులు పడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పది విద్యార్థులకు అంతర్గత మార్కుల వెరిఫికేషన్

పెర్కిట్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చీమన్‌పల్లి ట్రైబల్ వేల్ఫేర్ అసోసియేషన్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల వెరిఫికేషన్ నిర్వహించారు. పెర్కిట్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు అంతర్గత మార్కుల మూల్యంకరణ పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సోమ్లా, ఉపాధ్యాయులు డి.లక్ష్మణ్, కె.రాజ్‌కుమార్, ఎం.రాజన్న, సబ్జెక్టుల వారీగా వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టయ్యఫారంలో భేటీ బచావో.. భేటీ పడావో


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

నవీపేట,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్టయ్య ఫారంలో బుధవారం బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగళ గౌరి, శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే అడ్మిషన్‌లు పొందాలి

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలు పూర్తి కాగానే ఇంటర్మీడియట్ చదవడానికి ప్రభుత్వ కళాశాలలోనే అడ్మిషన్‌లు తీసుకోవాలని భీమ్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని దేవక్కపేట్, గోనుగోప్పుల, సికింద్రాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు విద్య అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో అధ్యాపకులు శ్రీనివాస్, సాయికుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఏసీపీ


విద్యార్థులకు పలు సూచనలు ఇస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ముప్కాల్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా బాల్కొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండు పోలింగ్ కేంద్రాలను బుధవారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెంకటేశ్వర్‌రెడ్డితనిఖీ చేశారు.నిజామాబాద్,ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాలోని శాసన మండలి ఉపాధ్యాయుల పట్టభద్రుల నియోజక వర్గాల ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఉన్న మౌలిక వసతుల గురించి అడిగితెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రా ల్లో విద్యుత్‌సరఫరా,ర్యాంప్, మరుగుదొడ్లు కనీస వసతులు కల్పించా లని, ఎలాంటి అవంతరాలకు జరుగకుండా ఎన్నికలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని విద్యా ర్థులను పలకరించారు. పలు సూచనలు చేశారు. వచ్చే పదవ తరగతి పరీ క్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో సబ్‌ఇన్స్‌పెక్టర్ నరేష్, మండల బీఆర్‌ఎస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌ను హత్యచేసిన నిందితుడికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు

ఏర్గట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేంద్రనగర్ గ్రామానికి చెందిన కొండ లక్ష్మీ అనే మహిళను హత్య చేసిన కుంచపు వెంకటేష్ అనే నిందుతుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, ఏర్గట్ల ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 22 తేదీన ఏర్గట్ల పీఎస్‌లో నాగేంద్రనగర్ గ్రామానికి చెందిన కొండ అనూష తన తల్లికొండ లక్ష్మీ కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. నిర్మల్ జిల్లా మామడ మండలం పోన్‌కల్ గ్రామానికి చెందిన కుంచపు వెంకటేష్‌తో కొండ లక్ష్మీ ఇద్దరికి పరిచయం ఉందని తెలిసింది. ఆమెకు కుంచపు వెంకటేష్ మాయ మాటలు చెప్పి మామడకు పిలిపించుకున్నట్లు తేలింది. అక్కడి నుంచి దిమ్మదుర్తి నల్దుర్థిరోడ్డులో ఉన్న అడవిలోకి తీసుకెళ్లి హత్య చేసి, తప్పించుకు తిరుగుతున్న కుంచపు వెంకటేష్‌ను బుధవారం అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నిజం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై రాములు తెలిపారు.

లక్ష్మీనర్సింహస్వామి సుదర్శన చక్రం ప్రతిష్ఠాపన

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం దేగాం గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం లక్ష్మీనర్సింహ స్వామి సుదర్శనచక్రం, అష్టబలి పీఠాలను ప్రతిష్ఠించారు. గతంలో సుదర్శన చక్రం సిమెంట్‌తో చేసినవి ఉండేది. చిన్నజీయర్‌స్వామి ఆదేశాల మేరకు కృష్ణశీలతో తయారు చేయించిన సుదర్శనచక్రాన్ని వేదపండితుల మంత్రోచ్చర ణాల మధ్య ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో బండారి యాదగిరి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బోధన్‌రూరల్,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ శాఖ ఏఈ లిఖిత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించారు. ఉపాధి హామీ నిధుల నుండి మొరం రోడ్డు పనులకు 10 లక్షల రూపాయలు, నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి 12లక్షల రూపాయలు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులను పరిశీలించడం జరిగిందని, నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని పంచాతీరాజ్ ఏఈ లిఖిత అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు టప్పా సాయిలు మాట్లాడుతూ తమ గ్రామానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ నాయకులు నాగేశ్వర్, సంజీవ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యువతి అదృశ్యం

నవీపేట,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన రాథోడ్ త్రిష అనే 19సంవత్సరాల యువతి అదృశ్యమైందని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఇంటర్మీడియట్ చదువుతున్న త్రిష ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉదయం పని నిమిత్తం బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. తల్లి రాథోడ్ మీనాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుత్పలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

మాక్లూర్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం గుత్ప గ్రామంలో రవీంధర్‌గౌడ్ సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.36వేల చెక్కును బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు చెక్కును అందజేశారు ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి, వినయ్‌కుమార్‌కు నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గ ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షుడు బాశెట్టి శశికుమార్, మాజీసర్పంచ్ చిన్నయ్య, నాయకుడు భూమేశ్వర్, షైమద్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో టిఫిన్ సెంటర్‌లకు జరిమానా


జరిమానా విధిస్తున్న కమిషనర్

భీమ్‌గల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్లాస్టిక్ వాడుతున్న పలు టిఫిన్ సెంటర్‌లను మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ జరిమానాలను వివరించారు. బుధవారం టిఫిన్ సెంటర్‌లకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిశుభ్రం పాటించకుండా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న టిఫిన్ సెంటర్ యాజమానులకు జరిమానాలు విధించారు. పరి శుభ్రత పాటించాలని, ప్లాస్టిక కవర్లను వాడకూడదని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

'చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయండి'

మాక్లూర్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటి అమల పర్చాలంటూ నిరసనగా చేస్తున్న ఈనెల 20న చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల అధ్యక్షుడు దేశెట్టి సాయిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ఈనెల 20న వేలాది మందితో హైదరాబాద్ తరలిరావాలని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ నాయకులు శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, దేశెట్టి రాధ, సరోజన, లత, కోల రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

● రాజు, ఎస్సై, పిట్లం



ఆంధ్రజ్యోతి: గంజాయి స్మగ్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: గంజాయిపై ప్రత్యేకంగా నిఘు ఏర్పాటు చెశారు. అనుమాన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని ఉంటున్నారు. గంజాయి స్మగ్లర్‌ను పట్టుకొని బైండోవర్ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పిట్లంలో గంజాయి మత్తులో యువకులు బానిసలు అవుతున్నారనె ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఎస్సై: గంజాయి మత్తుకు యువకులు బానిసలు అవుతున్నారనే విషయం తమ దృష్టికి రావడంతో ప్రత్యేకంగా రాత్రి, పగలు ఆయా ప్రాంతాలలో తనిఖీలు చెస్తున్నాం.పట్టు బడిన వారికి బైండోవర్ చెస్తున్నాం..ఎక్కడైనా గంజాయి యువకులు సేవిస్తే పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆంధ్రజ్యోతి: రాత్రి వేళలో పిట్లంకు అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

ఎస్సై: అక్రమ ఇసుక రవాణాను సహించేది లేదు. రాత్రి వేళలో ఎలాంటి అనుమతులు లెకుండా మంజీర ప్రాంతం నుంచి వస్తున్న ఇసుక టాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేశామన్నారు. అక్రమ ఇసుక రవాణాను సహించేది లేదు, ఎంతటి వారినైపా వదిలేది లేదు.

ఆంధ్రజ్యోతి: నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: ద్విచక్ర వాహన దారులు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే అలాంటి వారి వాహనదారులపై చట్టా రీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. త్రిబుల్ రైడింగ్ వాహన దారులపై చర్యలు తీసుకుంటాం, తల్లితండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదు, పోలీసుల తనిఖీలలో పట్టుపడితే కేసులు నమోదు చెస్తాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్సై: వాహనదారులు వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించడం జరుగుతుందని, నిబంధనలు పాటించని వాహన దారులపై చర్యలు తీసుకుంటాం. రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

● (ఆంధ్రజ్యోతి,పిట్లం)



అంక్సాపూర్ క్రాస్‌రోడ్డు నుంచి కుకునూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఆరబోసిన తెల్లజొన్నలు



సాహెబ్‌పేట్, జాన్కంపేట్ వెళ్లే రహదారిపై ఆరబోసిన ఎర్రజొన్నలు



కుకునూర్ సమీపంలో ఆరబెట్టిన జొన్నలకు అడ్డుగా కర్రలు వేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి పరిశీలన

రహదారులే కల్లాలు

- ప్రధానరహదారులపై ఎర్రజొన్నలు, తెల్లజొన్నల ధాన్యం ఆరబోత
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

వేల్పూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రజొన్నలు, తెల్లజొన్నల పంట చేతికి వచ్చి దీంతో రహదారులపై రైతులు పంటలను ఆరబోయడంతో కల్లాలను తలపిస్తున్నాయి. వేల్పూర్ మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఎర్రజొన్నలు, తెల్లజొన్నల దాన్యాన్ని ప్రధాన రహదారులతో పాటు గ్రామాల మధ్య ఉన్న రహదారులపై ఎండ బెడుతున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని 63వ జాతీయరహదారి ఒడ్డెరకాలనీ క్రాస్ రోడ్డు నుంచి పడిగెల బీడుగా వన్నెల్(బి) వరకు, పచ్చలనడ్కుడ, చేంగల్ శివారు ఉన్న రోడ్లపై ఎర్రజొన్న ధాన్యం ఆరబోశారు. పంటలను ఎండబెట్టడంతో వచ్చేపోయే వాహనదారులకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళల్లో పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎర్రజొన్న ఆరబెట్టిన రోడ్ల మీదుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోయి గాయాల పాలైన సంఘటనలు చాలా ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలకు ఆనవాలుగా మారిన ఎర్రజొన్న ధా న్యం ఆరబెట్టిన రోడ్లపై కల్లాలను తొలగించే విధంగా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు. ధాన్యం ఆరబెట్టడంతో రోడ్లపై ఓ వైపు నుంచి వాహనాలు వస్తుంటే మరో వైపు నుంచి ఎదురుగా వాహనం వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ప్రయాణానికి అసౌకర్యం ఏర్పడుతుంది. గ్రామీణ ప్రాంతా ల్లోని సీసీరోడ్లు, బీటీరోడ్లపై పూర్తిగా ఎర్రజొన్న ఆరబెట్టడం వల్ల రాకపోకలకు ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతు న్నారు. రోడ్లపై ఎండబోసిన ఎర్రజొన్న ధాన్యం దూరంగా చెల్లచెదురై చిల్లకుండా ఉండేందుకు కల్లాల చుట్టూ పెద్ద రాళ్లు, కర్ర మొద్దులు, ఎడ్ల బండి చక్రాలను అడ్డుగా పెడుతున్నారు. దీంతో రాత్రి సమయంలో రోడ్లపై కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు జోక్యం చేసుకొని ప్రధాన రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకునే విధానాన్ని నిషేదించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

కలియుగ దైవం గోవింద నామస్మరణతో సకల శుభాలు



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి అని నిత్యం గోవిందా నామస్మరణ జపిస్తే సకల శుభాలు కలుగుతాయని వేద పండితులు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని శ్రీనివాస్ క్యాంప్‌లో గల శ్రీలక్ష్మి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించబడతాయన్నారు. మొదటి రోజు స్వామి వారి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోవిందా నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ, గ్రామస్థులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితతరులు పాల్గొన్నారు.

ముత్యంపేటలో ముగిసిన ఎల్లమ్మ ఉత్సవాలు

దోమకొండ, ఫిబ్రవరి 19 (అంధజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామంలో రేణుకాదేవి అమ్మవారి 61వ వార్షికోత్సవం ఉత్సవాలు బుధవారం నాటికి ముగిసాయి.ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్, ఎస్సై స్రవంతి ఆధ్వర్యంలో ముత్యంపేటలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బుధవారం ఆలయం ఆవరణలో చక్కెర తీర్థం కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా సీతలాదేవి మల్లిఖార్జునస్వామి కల్యాణం

లింగంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డిలో బుధవారం రజకుల ఆరాధ్యదైవం సీతలాదేవి మల్లిఖార్జున స్వామిల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతీఇంటి నుంచి బోనం తీసుకుని గ్రామంలో శోభాయాత్రగా ఆలయం వరకు వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులను కాపాడాలని దేవి దేవతలను వేడుకున్నారు.



శెట్పల్లి సంగారెడ్డిలో సీతలాదేవికి బోనాలు సమర్పిస్తున్న రజకులు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● కోటగిరి, పొతంగల్ మండలాల్లో జిల్లా కలెక్టర్ తనిఖీలు



కోటగిరి మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో నూనె ప్యాకెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

కోటగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైద్యులు సమయపాలన పాటించడంతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశించారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పొతంగల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ల్యాబ్, రోగులకు అందిస్తున్న వైద్య చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు ఎంత మంది రోగులు చికిత్సల కోసం ఆసుపత్రికి వస్తున్నారని రిజిస్టర్‌లో పరిశీలించారు. రోగులకు సరిపడా అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి మెరుగైనా వైద్య సేవలు అందుతున్నాయా అని వాకాబు చేశారు. అత్యవసర సమయంలో రోగులను ఎక్కడికి పంపుతున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బోధన్, జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నట్లు వైద్యులు వివరించారు. అనంతరం కోటగిరి మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. అంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుండగా సరిపడ ఫ్యాకల్టి ఉన్నారా అని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకెఉన్నారు. కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యత స్టాక్‌లను పరిశీలించారు. వంటనూనె, పాలు, కోడిగుడ్ల నాణ్యత పరిశీలించిన కలెక్టర్ కాలపరిమితి ముగిసిన వాటిని వంటలో వినియోగించకూడదని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేలా సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మొబిన్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దోసకాయపై శివాజీ చిత్రం

ఫొటో న్యూస్



మద్నూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని మద్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చిత్రకళ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బాస బాల్ కిషన్ దోసకాయపై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రం గీసి ఆకట్టుకున్నారు. దీన్ని చూసిన చూపరులు బాస బాల్‌కిషన్‌ను అభినందించారు. గతంలో సైతం ఇతను వినూత్నంగా చిత్రాలు వేసే కళాకారుడిగా గుర్తింపు పొందారు. ఆయన కళను చూసి పలువురు అభినందించారు.

అపరిశుభ్ర వాతావరణంలో యోగా కేంద్రం

● యోగా కోసం ముందుకు రాని గర్భిణులు, స్థానికులు ● పట్టించుకోని అధికారులు

జర దేఖో!!



ఎల్లారెడ్డిలో నిర్మించిన యోగా కేంద్రం



యోగా కేంద్రం వెనుక పందుల స్వైర విహారం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రజల ఆరోగ్యాల ప్రయోజనాల కోసం ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి యోగ కేంద్రాన్ని నిర్మించి, యోగ నేర్పించడానికి యోగా టీచర్ నియమించినప్పటికీ యోగా కేంద్రం పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా దుర్వాసన రావడంతో యువ కేంద్రానికి రావడానికి గర్భిణులు స్థానిక ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రి వెనకాల ఉన్న కేంద్రం చుట్టూ మురికి కాలువలో పందుల స్వైర విహారం, బాత్రూం డోర్ విరిగి పోవడం వంటి సమస్యలు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి యువ కేంద్రం చుట్టూ పరిశుభ్రత ఉండేవిధంగా చూడాలని అదేవిధంగా బాత్రూం వంటి సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం అటువైపు దృష్టి సాధించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలి

● సబ్ కలెక్టర్ కిరణ్మయి



నీరు పడుతున్న తీరును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బీర్కూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె బీర్కూర్ మండలంలో పర్యటించారు. మొదట బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం బీర్కూర్‌కు చేరుకొని గ్రామ శివారులో నాటిన మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీరు పట్టడాన్ని ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికా హారాన్ని అందించాలని సూచించారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలకు చేరుకుని పిల్లలతో మాట్లాడారు. పలుసూచనలు చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించి వేసవికాలంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగు నీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. పలు సూచనలు చేశారు. అదేవిధంగా వివిధ అంశాలపై మండల ప్రత్యేకాధికారి ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈల తో చర్చించి తగు సూచనలు చేశారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి అనీల్, ఎంపీడీవో భానుప్రకాష్, తహసీల్దార్ లత, ఎంపీవో మహబూబ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలు



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

గాంధారి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యా బోధన ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం అన్నారు. బుధవారం మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పొతంగల్ కలాన్, పేట్‌సంగెం, చద్మల్‌తండా, గాంధారి, గండివేట్, గౌరారం, లింగంపేట మండలంలోని నల్లమడుగు హైస్కూల్‌లోని విద్యార్థులను కలిసి ఇంటర్‌లో అడ్మిషన్‌లు పొందాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకుంటే మంచి విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్ సదుపాయాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్‌కుమార్, లక్ష్మణ్, వెంకటస్వామి, శ్రీధర్, రమేష్, సుజాత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఎల్లారెడ్డి బస్టాండ్

● ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిర్మాణం దాదాపు పూర్తి ● పనులు పూర్తి కావడంతో ప్రయాణికుల హర్షం



ఎల్లారెడ్డిలో బస్టాండ్ నిర్మాణం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలో తెర పడనుంది. రెండు సంవత్స రాల క్రితం గత ప్రభుత్వ హయాంలో ఎల్లారెడ్డిలో ఉన్న బస్టాండ్ శిథిలా వ్యవస్థకు చేరడంతో నూతనంగా నిర్మించడానికి నాలుగు కోట్ల రూపా యలతో మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ప్ర భుత్వం మారడంతో నిధులు రాక బస్టాండు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో ప్ర యాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రజలకు ప్రయాణికులకు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక చొరవ తీసుకొని బస్టాండ్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిధులు విడుదల చేయాలని కోరారు. దీంతో నిధులు విడుదల కావడంతో అర్ధాంతరం గా నిలిచిపోయిన బస్టాండ్ నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయి. పను ల నిర్మాణాలను ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు పలుమార్లు సూచించారు. దీంతో నిర్మాణ పనులు దాదాపు పూర్తి అయ్యాయి.



నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్లు

● బస్టాండ్‌లో నూతన హంగులాలతో పనులు

బస్టాండ్ నిర్మాణంతో పాటు చెట్టు కాంపౌండ్ వాల్ 8 దుకాణ సముదాయాలతో పాటు క్యాంటీన్ కంట్రోలర్ రూమ్, మూత్రశాలలు, మరుగు దొడ్లు, ఎలక్ట్రికల్ పనులు పెయింటింగ్ వంటి పనులు పూర్తి అయ్యాయి. సీసీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పూర్తికాగానే వినియోగంలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

త్వరలోనే ప్రారంభిస్తాం

● మదన్ మోహన్‌రావు, ఎమ్మెల్యే

కేంద్రంలో నిర్మిస్తున్న నూతన బస్టాండ్ నిర్మాణం పనులు నిధులు లేక మధ్యలో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రయాణికులకు ఇబ్బంది అవుతుందని నిర్మాణ పనులు పూర్తి కావడానికి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయ్యేలా కృషి చేసి నిర్మాణ పనులు దాదాపు పూర్తి అయ్యాయి, బస్టాండ్ లోపల ముందు సీసీ పనులు జరుగుతున్నాయి పూర్తికాగానే ప్రయాణికులకు అందుబాటు లోకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరిస్తాం.

ఆరోగ్యంపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి



బస్తీ దవాఖానాలో మాట్లాడుతున్న డాక్టర్ రాజశ్రీ

బోధన్‌రూరల్,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల బస్తీ దవాఖానాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో, పర్యవేక్షకులతో ఫైలేరియా, బోధకాలుపై నివారణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు, వచ్చే నెల 13, 18, 23తేదీలలో ఎంపిక చేయబడిన ప్రాంతాలలో రాత్రిపూట వైద్య సిబ్బంది రక్త నమూనాలను సేకరిస్తారని, ప్రజలు కూడా సహకరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, బోధన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమతలతో పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తూంపల్లిలో పశువైద్య శిబిరం



తూంపల్లిలో పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వెటర్నరీ వైద్యులు

సిరికొండ ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంపల్లిలో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు.గ్రామంలోని గేదెలకు ఆవులకు గర్భకోశ వ్యాధులకు తగిన చికిత్సలు అందజేసినట్లు పశువైద్యాధికారి డా.అభిషేక్ తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యము గురించి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో 42 గేదెలు, 18 ఆవులకు చికిత్స చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోడీఎల్‌డీఏ అబ్దుల్ మాజీద్, సూపర్‌వైజర్ కృష్ణ, వీడీసీ అధ్యక్షుడు లక్ష్మన్‌గౌడ్, బాలకిసన్ , దేవయ్య, సిబ్బంది శ్రీనివాస్, చంద్రశేఖర్, సతీశ్, రంజిత్, వెంకన్న రైతులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

● టీయూలో బంజారా విద్యార్థి నాయకులు



టీయూలో మాట్లాడుతున్న బంజారా విద్యార్థి నాయకులు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో ఈ నెల 21న బంజారాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు గిరిజన శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నమని ఈ కార్య క్రమానికి సింగరేణి కాలరీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ హాజరువుతున్నారని గిరిజన శక్తి విద్యార్థి సంఘం వర్సిటీ అధ్యక్షుడు శ్రీను రాథోడ్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, బంజార సంఘం ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌వో అధ్యక్షుడు సాగర్ నాయక్, లక్ష్మణ్, పృథ్వి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



సత్యనారాయణ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న మాజీ జడ్పీటీసీ

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మాధవనగర్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొత్త సత్యనారాయణ గుప్తా (71) అనారోగ్యంతో మృతి చెందాడు. వినయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రూరల్ నాయకుడు మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డిజగన్ ఆబాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించి కుటుంబ సభ్యులకు సానూభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

డిచ్‌పల్లి: మాధవనగర్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ గుప్తా మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బుధవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులచారి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దవాల్గొట్‌లో పేకాటరాయుళ్ల పట్టివేత

● 7,550నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

సిరికొండ,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్ద వాల్గొట్‌లో పేకాట ఆడుతున్నరన్న పక్కసమాచారంతో సిరికొండ ఎస్సైరాము ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి బుధవారం సాయంత్రం పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కామరాజు, నాగలి శ్రీను, పిట్ల మాస్సింగ్, తంసే గంగాధర్, ఒడ్డె రాములు పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. పేకాట రాయుళ్ల నుంచి సెల్ ఫోన్‌లు, 7,550రూ. నగదు స్వాధిన పర్చుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

ఖిల్లా,ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి):మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రెండు రోజుల పాటు కోర్టు జైలు శిక్ష విధించినట్లు, మరో 15 మందికి రూ.36200లు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. నగరంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి వాహనాలు నడిపిన 18మందిని గుర్తించారన్నారు. వీరికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కౌన్సెలింగ్ నిర్వహించి బుధవారం కోర్టు ఎదుట హాజరు పర్చగా పై విధంగా రెండవ క్లాస్ న్యాయాధికారి నూర్జహాన్ శిక్షను విధించినట్లు చెప్పారు. కోటగల్లీకి చెందిన ఎస్.శ్రీనివాస్, నిర్మల్‌కు చెందిన రాజేశ్,ఖిల్లా రోడ్డుకు చెందిన ఎండి.అఖిల్ వ్యక్తులకు జైలు శిక్ష విధించారన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● సాలూర ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ
● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



వంటగదిలో భోజనాన్ని పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉన్న పదార్థాలను పరిశీలించారు. భోజనం తయారీ కోసం నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగించాలని, కాలం చెల్లిన నాసిరకం పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వాడవద్దని పేర్కొన్నారు. వంటలు తయారు చేసే సమయంలో శుభ్రత పాటించాలని, ప్రతి వంటకంపై మూతలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. భోజనం వండేందుకు వినియోగిస్తున్న ప్రతి ఆహార పదార్థాన్ని అను నిత్యం విధిగా పరిశీలించాలని సూచించారు. స్థానికంగా ఏమైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని ఆయన సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహల్లో చదివే విద్యార్థులు తమ పిల్లలులాంటి వారేనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాల పరిసరా ప్రాంతాలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సాలూర తహసీల్దార్ శశిభూషణ్, ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.

ఇన్సూరెన్స్ కంపెనీని మోసగించిన కేసులో నిందితుల అరెస్టు

● 27బైక్‌లు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఏసీపీ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ కంపెనీని మోసగించి బైక్‌లను వేరే గ్రామాల వారికి అమ్మిన కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి 27బైక్‌లను స్వాధనం చేసుకున్నట్టు ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం ఆర్మూర్ శివారులోని ఆలూర్ బైపాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా నిందితులను పట్టుకొని విచారించినట్టు ఆయన తెలిపారు. హీరో పిన్‌కార్ప్ లిమిటెడ్ టర్చరి సెల్స్‌మేనేజర్ షేక్ అబ్దుల్ రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించగా హైదరాబాద్‌కు చెందిన సయ్యద్‌హుమేర్, షహీద్‌అలీ, షబ్బీర్‌ఖాన్‌లు అడ్రస్ ప్రూఫ్స్ సరిగ్గా లేని ఐడికార్డులను పెట్టి బైక్ షోరూంలో డౌన్ పే మెంట్‌ను చెల్లించి హీరో పిన్‌కార్ప్ లిమిటెడ్ ద్వారా బైక్ లోన్‌లను తీసుకొని రెండు ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించి కామారెడ్డికి చెందిన యాసిన్‌కు పంపగా ఆర్మూర్ మండలంలోని మిర్దాపల్లి, రాంపూర్, అంకాపూర్ గ్రామాలకు చెందిన యోగేష్‌రెడ్డి, ప్రశాంత్, వెంకట్ రెడ్డిలతో పాటు సిరికొండ మండలం హుస్సేన్‌నగర్‌కు చెందిన నరేష్, ధర్పల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌లకు కమిషన్‌పై ఏజెంట్‌లుగా చేసుకొని వారి ద్వారా వారు తీసుకువచ్చిన బైక్‌లను ఆర్మూర్, డొంకేశ్వర్, సిరికొండ, ధర్పల్లి, మాక్లూర్ మండలాల్లో తక్కువ రేటుకు అమ్మకాలు చేశారని, అలాగే వీటితో పాటు వేరే ఫైనాన్స్ కంపెనీ నుంచి లోన్ తీసుకున్న మరికొన్ని బైక్‌లను అమ్మినట్టు విచారణలో తేలిందని ఆయన తెలిపారు. కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహారించిన ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్సైలు గోవింద్, మహేష్, ఇంద్రకరణ్ రెడ్డిలతో పాటు ఐడిపార్టీ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి, రాములు, కానిస్టేబుళ్ల అశోక్‌శ్రీనివాస్, ఆనంద్, హరిష్‌లను ఏసీపీ అభినందించారు.

● అత్యాశకు వెళ్లి కటకటాల పాలు

తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఉద్దేశంతో అత్యాశకు వెళ్లి ఇన్సూరెన్స్ కంపెనీని మోసం చేసి కటకటాల పాలైన ఉదంతమిది. కష్టపడి పని చేసుకొని సంపాదించుకోవాల్సిన వారు అడ్డదారిలో డబ్బులు వస్తాయని కలలు కన్నారు. హైదరాబాద్‌లో కొన్న వాహనాలను ఏదో మారుమూల గ్రామాల్లో అమ్మకం చేస్తే బయటకు పొక్కదనుకున్న వారి ఆలోచనలు బెడిసికొట్టింది. సుమారు 60వరకు వాహనాలను అమ్మకాలు చేసినట్టు తెలిసింది. ఈ అమ్మకాలు రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో చేశారా లేదా తెలిసిన గ్రామాల్లో చేశారా వేచి చూడాల్సిందే.

ఆటో కోసం స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తి అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఏసీపీ

ఖిల్లా,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):ఆటో కోసం తన స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తిని నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐదో టౌన్ ఎస్ఐ. గంగాధర్, సిబ్బంది అరెస్టు చేసినట్లు నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజవెంకట్‌రెడ్డి తెలిపారు. వివరాలను ఆయన బుధవారం తన చాంబర్‌లో వెల్లడించారు. జల్సాలకు అలవాడు పడి దొంగతనాలు, హత్యలు చేసిన పాత నేరస్తుడు బైరగోని సతీష్ అనేవ్యక్తి హైదరాబాద్‌కు చెందిన మహిళతో వివాహంచేసుకున్నాడు.దొంగతనాల కు అలవాడుపడడంతో ఆమెభర్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది.అప్పటి నుంచి పలు పోలీసు స్టేషన్లలో దొంగతనాలు చేయడం జైలుకువెళ్లడం జరిగిందన్నారు. గత కొంతకాలంగా నగరంలోని నాగారం ప్రాంతంలో నివాసం ఉంటూ సందీప్ అనే ఆటోడ్రైవర్ తోపరిచయం చేసుకున్నాడు. త రుచూ వీరిద్దరు కలిసి మద్యంతాగడం చేసేవారు. తన జల్సాల కోసం డబ్బులు లేకపోవడంతో ఎలాగైన ఆటోను దొంగిలించాలనుకుని పథకం ప్రకారం సందీప్ అనే ఆటోడ్రైవర్‌తో కలిసి వెళ్లేవాడు. వచ్చిన ఆటో డబ్బులతో ఇద్దరు మద్యం తాగేవారు. ఈనెల 15వ తేదీన ఇద్దరు కలిసి మద్యం తాగి ఇందల్‌వాయి వైపుకు వెళ్లారు. అప్పటికే సందీప్ మద్యం మత్తులో స్పృహ కోల్పోవడంతో ఆటో ను నడుపుతూ చంద్రయాన్‌పల్లి గ్రామం దాటిన తర్వాత రోడ్డు పక్కన ఆటోను ఆపి మూత్ర విసర్జన చేయడానికి రోడ్డు దిగారు. అక్కడ ఎవరు లేనిది చూసి సందీప్ వద్ద నుంచి సెల్‌ఫోన్ తీసుకుని ఆయనను కిందపడేసి బండరాయితో తలపై బాది హత్య చేశాడన్నారు. ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు మృతదేహాన్ని చెట్లపొదల్లో పెట్టి దహనం చేశాడన్నారు. తన భర్త ఎంతకు ఇంటికి రాకపోవడంతో నగరంలోని ఐదో టౌన్‌లో మృతుడి భార్య కండెల లత ఫిర్యాదు చేసిందన్నారు.కేసునమోదుచేసుకుని దర్యాప్తు చేయ గా వివిధ కేసుల్లో నిందితుడి కోసం గాలించారన్నారు.సతీష్‌గౌడ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తిరిగి బుధవారం నగరానికి వస్తుండగా మాధవనగర్‌గేట్ వద్ద అతన్ని అదుపులోకి తీసుకుని విచారణజరిపారన్నారు. సాంకేతిక ఆధారంగా అన్ని కోణా ల్లో కేసును పరిశీలించిన పోలీసులు నేరం అంగీ కరించడంతో కేసున మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ చెప్పారు. కేసును చాకచక్యంగా ఛేదించినందుకు ఏసీపీ అభినందించారు.

కలిగోట్‌లో మొక్కలను పరిశీలించిన రాష్ట్ర ప్రత్యేక కమిషనర్



మొక్కలను పరిశీలిస్తున్న హైదరాబాద్ గ్రామీణ శాఖ ప్రత్యేక స్పెషల్ కమిషనర్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకల్, కలిగోట్ గ్రామాల్లో బుధవారం నర్సరీలు, నాటిన మొక్కలను తెలంగాణ రాష్ట్ర గ్రామీణ శాఖ ప్రత్యేక స్పెషల్ కమిషనర్ సతీ ఉల్లాల్ల పరిశీలించారు. పడకల్‌లో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. నాటిన మొక్కలను పెంచే బాధ్యత అందరిపై ఉందని అధికారులకు సూచించారు. అనంతరం నర్సరీలలో పెంచుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు. వచ్చే వర్షాకాలం నాటేందుకు నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. కలిగోట్‌లో గ్రామపంచాయతీ స్థల పరిధిలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. గ్రామపంచాయతీ కమ్యూనిటీ స్థల పరిధిలో జమ, ఈత, తాటి మొక్కలను తప్పకుండా పెంచాలని అధికారులకు ఆదేశించారు. మొక్కలను నాటేందుకు తీసుకోవల్సిన చర్యలు, సూచనలు చేశారు. ఆయన వెంట స్టేట్ ప్లాంటేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింహరావు, డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఏపీవో రవి, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

తలసేమియా వ్యాధి చికిత్సకు ఆరోగ్యశ్రీ వర్తింపు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధి చికిత్స కు రాజీవ్ ఆరోగ్యశ్రీ వర్తింపు జరిగిందని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలి పారు. నేటి నుంచి ఆరోగ్యశ్రీ నియమాల మేరకు చికిత్స ఉంటుందని తెలిపారు. రోగులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ప్రస్తుతం మంగళవారం, గురు వారం, శనివారాల్లో చికిత్స జరుగుతుందని తెలిపారు. రోగుల సంఖ్య పెరిగినప్పుడు ప్రతీరోజు ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈఅవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి



బాలికల పాఠశాలలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి అశోక్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ డే, అనివల్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువులో ముందుండి మంచి సంపాదించాలని, పదవ తరగతి విద్యార్థులు మంచి ప్రతిభ చూపి 575 మార్కులకు పైగా సాధించి ట్రిబుల్ ఐటిలో సీటు సంపాదించాలని ఆయన అన్నారు. తమ టార్గెట్‌తో ముందుకు వెళ్లాలని విద్యార్థినిలకు ఆయన సూచించారు. అనంతరం విద్యార్థినిలు చేసిన సాంస్కృతిక నృత్యాలు తిలకించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, ప్రధానోపాధ్యాయురాలు వనజ, కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, గంగాధర్, సానిటరీ ఇన్స్‌పెక్టార్ గజానంద్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): నేడు పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని విద్యుత్ ఏఈ ఆశ్రితరెడ్డి తెలిపారు. 11కెవి విద్యుత్ లైన్‌లో మెంటెన్స్‌లో భాగంగా పట్టణంలోని నిజామాబాద్‌రోడ్, కమలానెహ్రూకాలనీ, కెనాల్‌కట్ట, బృందావని టాకీస్ పక్కన ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం ఉందని ఆమె తెలిపారు.

పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖిల్లా,ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి):వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పసుపు రైతుల సదుపాయం కోసం బుధవారం నుంచి రైతులు నేరుగా కొనుగోలు దారుడికి అమ్ముకునే కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈ కేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు. నేరుగా రైతు అమ్మిన పంటలకు వ్యాపారులు ఎటు వంటి కమిషన్లు లేకుండా రైతు ఖాతాలోకి డబ్బులు వేసే అవకాశం ఉంటుం దన్నారు.రైతులు ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.88700	రూ.81800	రూ.1010

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (10.45, 7.20) : లైలా (1.25)
: తండేల్ (4.15, 10.00)
స్క్రీన్-2 : చావా (హిందీ) (10.00, 4.00, 10.25)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (1.20)
: తండేల్ (7.20)
స్క్రీన్-3 : తండేల్ (10.30)
: నిదిరించు జహపనా (1.35)
: లైలా (4.10) : చావా (హిందీ) (7.00)
: సనం తేరీ కసమ్ (హిందీ) (10.20)
స్క్రీన్-4 : తాలా (10.55)
: సంక్రాంతికి వస్తున్నాం (1.35, 7.40)
: బ్రహ్మ ఆనందం (4.35) : లైలా (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : చావా (హిందీ) (11.00, 1.40, 7.30, 10.20) : తండేల్ (4.30)
స్క్రీన్-2 : లైలా (10.45, 1.40, 7.40, 10.20)
: చావా (హిందీ) (5.00)
స్క్రీన్-3 : తండేల్ (11.00, 1.40, 7.40, 10.20) : బ్రహ్మ ఆనందం (4.30)



దేవి : లైలా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : చావా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్